కథ

# చెప్పులు

సాయంత్రం ఆరున్నరకు తిరుపతిలో బయలుదేరిన నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ 'నారాయణా! నారాయణా!' అంటూ వొగుర్చుకుంటూ పరుగిడుతోంది.

త్రీటయర్ స్లీపర్‌లో డెబ్బయ్యో నంబరు బెర్తు కామేశానిది. అతని పక్కన యాభై ఏళ్ల బట్టతలాయన, ఆ పక్కన కిటికీ దగ్గర ఆయన భార్య కూర్చున్నారు. ఎదుటి బెర్త్‌లో కిటికీవైపు ముప్పయేళ్ల యువతీ, ఆమె పక్కనే గుండు చేయించుకున్న ఆమె భర్తా, వారి పదేళ్లపాపా వున్నారు. ఇకపోతే సైడ్‌బెర్త్‌లలో ఓ గిరిజాల యువకుడు, డెబ్బయ్యేళ్ల వృద్ధుడూ వున్నారు.

చిరకాలపు మొక్కుబడిని తిరుమలలో తీర్చుకుని తిరిగి వస్తున్నాడు కామేశం. ముప్పయ్ అయిదేళ్లుంటాయి అతనికి.

ఆడవాళ్లిద్దరూ పలకరింపులతో ఆరంభించి కబుర్లలో మునిగిపోయారు. కామేశం పక్కనున్న బట్టతలాయన, ఎదుట కూర్చున్న గుండాయన తిరుమలలో పెరిగిపోతూన్న భక్తుల రద్దీతో మొదలుపెట్టి, ఆర్జిత సేవరేట్లు పెంచడమేతప్ప యాత్రికులకు తగుసదుపాయాలు చేయని దేవస్థానం వారి అసమర్థతను తూర్పారబట్టి, అన్నిటికీ మూలకారణం రాజకీయ నాయకులేనని తీర్మానం చేసి, అటుపైన రాజకీయరంగాన్ని, అందులోని ప్రముఖుల్నీ దుయ్యబట్టడం ఆరంభించారు. మధ్య మధ్య వారిలో తానూ వున్నానని పిస్తున్నాడు సైడ్‌బెర్త్‌లోని ముసలాయన. గిరజాల యువకుడు మాత్రం పై బెర్త్ ఎక్కి తెలుగు నవల ఒకటి సీరియస్‌గా చదివేస్తున్నాడు.

కామేశం తెలుగు దినపత్రికను తిరగేస్తున్నాడు. అది అతనిది కాదు. గుండాయనిది. చూపులు అక్షరాల మీద వున్నా చెవులు మాత్రం వారి సంభాషణను ఆసక్తిగా ఆలకిస్తున్నాయి.

కామేశం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ స్కూల్లో ఎలిమెంటరీ క్లాసు టీచరు. అతనికంటే ముందు బాధ్యతలు పుట్టడంలో బాధలేతప్ప అన్యం ఎరుగని జీవితం అతనిది. గంతకుతగ్గబొంత అన్నట్టు మరో అనాథ పిల్ల అతన్ని నాథుణ్ణిగా చేసుకున్న కారణంగా ఓ ఇంటివాడయ్యాడు. ప్రస్తుతం ఓ పదేళ్ల పాప వుంది. ఎదుగుతూన్న సంసారం..ఎదుగూ బొదుగూ లేని జీవితం..చాలీ చాలని జీతం..తీరని కోరికలు..తేలని సమస్యలు..తీరం చేరని నావలాంటి బ్రతుకు. పదేళ్లక్రితం భార్య పురిటిలోనే కన్ను మూస్తుందనిపించిన తరుణంలో దిక్కుతోచని క్షణంలో-ఏడు కొండలవాడే దిక్కనుకున్నాడు కామేశం. కొండకువచ్చి తలనీలాలు సమర్పించుకొంటానని మొక్కుకున్నాడు. దేవుడు మొరాలకించి భార్య మళ్లీ జీవం పోసుకుని పదేళ్లయినా తన మొక్కుబడిని మాత్రం తీర్చుకోలేకపోయాడతను. ఈనాటికి వీలు కుదిరింది.

''అదేమిటండీ, రైలు ప్రయాణంలో పట్టుచీరె కట్టుకున్నారు? పాడయిపోదూ?'' అంటోంది బట్టతలాయన భార్య, ఆ యువతితో.

''ప్రయాణాల్లో సయితం పట్టుచీరలే కట్టుకోవాలంటారు మా వారు'' అందాయువతి సగర్వంగా.

''మీవారు ఏం చేస్తుంటారేమిటి?''

''రియల్ ఎస్టేట్ బిజినెస్''

''అదీ సంగతి!'' అనుకున్నాడు కామేశం, వారి సంభాషణ చెవిలో పడడంతో. 'స్మశానాలను సయితం కబ్జా చేసుకుని శవాలక్కూడా చోటు లేకుండా చేసేస్తున్న జంట నగరాలలో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తూ ఆ వ్యక్తి భార్యకు పట్టుబట్టలేం ఖర్మ! ఒళ్లంతా బంగారంతో దిగేసినా ఆశ్చర్యపోనవసరం లేదు' అనుకున్నాడు.

> **చెమటోడ్చేవాడొకడైతే సంచులు నింపుకునేవాడు ఇంకొకడు. అందుకే భవిష్యత్తుకు పునాదిరాళ్లయిన యువత పెడదారిన పడే ప్రమాదం ఏర్పడుతోంది. ఇందుకు కారకులెవరు? రాజకీయ నాయకులా? యువతను ప్రభావితం చేయలేని విద్యావిధానమా?? అస్తవ్యస్థంగా తయారైన వ్యవస్థా?... నిట్టూర్చాడు కామేశం.**

''ఈ చీర రంగు వెలిసిపోయినా వొళ్లయినా కప్పుతోందని సంతోషించాను. ఇప్పుడిదీ చికిలిపోయి విడిపోతోందండీ. త్వరలో మరో చీర కొనుక్కుంటే తప్ప మానం దక్కేలా లేదు..'' అన్న భార్య పలుకులు హఠాత్తుగా గుర్తుకొచ్చాయి అతనికి. ఆమె ఆ మాట అని మూణ్ణెల్లయినా ఓ ముతక చీరె కూడా కొనిపెట్టలేకపోయాడు తను..నిట్టూర్పు లోలోపలే అణగారిపోయింది.

మగవారి మధ్య పొలిటికల్ డిస్కషన్ జోరుగా సాగుతోంది.

''...అసలు ఆ పార్టీని పదవిలోంచి పడగొట్టాలి. అప్పుడుగాని ప్రజల ఇక్కట్లు గట్టెక్కవు'' అంటున్నాడు గుండాయన.

''అయినా ఆ నాయకుణ్ణి ఎన్నుకోవడం ప్రజలదే తప్పు. అందుకు అనుభవించక తప్పదు'' అంటున్నాడు బట్టతలాయన.

''ఆరోజుల్లో గాంధీ, నెహ్రూ, పటేల్ వంటి నాయకులు వుండబట్టి దేశం అభివృద్ధిలోకి వచ్చింది. ఈనాడు వినాయకులేగాని నాయకులెక్కడున్నారు?'' అంటున్నాడు సైడుబెర్తులోని ముసలాయన.

''ఔనౌను. మీవి స్వాముల రోజులయితే మావి స్కాముల రోజులు, సాముల రోజులూను..'' అని గుండాయన అనడంతో ఫకాలున నవ్వారంతా.

కామేశం ఆలోచనలో పడ్డాడు. 'ఏ దేశపు చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?' మహాకవి అన్నట్టు..ఏ పార్టీ అయితేనేం, ఏ పాలకుడయితేనేం-పేదల బ్రతుకులకు ఆదరవులేదు. లక్షాధికారులు కోటీశ్వరులుగానూ, పేదలు బికారులుగా అయ్యే ఈ వ్యవస్థలో ఎవరు పదవిలోకొచ్చినా, ఎన్నేళ్లు పాలించినా అట్టడుగునున్నవారి జీవితాలకు కట్టుబట్టలు కూడా కరువే తప్ప మెరుగుపడతాయనేది కల, కల్లాను!

చెమటోడ్చేవాడొకడైతే సంచులు నింపుకునేవాడు ఇంకొకడు. అందుకే భవిష్యత్తుకు పునాదిరాళ్లయిన యువత పెడదారిన పడే ప్రమాదం ఏర్పడుతోంది. ఇందుకు కారకులెవరు? రాజకీయ నాయకులా? యువతను ప్రభావితం చేయలేని విద్యావిధానమా?? అస్తవ్యస్థంగా తయారైన వ్యవస్థా?...నిట్టూర్చాడు కామేశం. అవన్నీ జవాబు దొరకని ప్రశ్నలని అతనికి తెలుసు. కాని, మనసున్నంతవరకు, మెదడు పనిచేస్తున్నంతవరకు ఆలోచనలు తప్పవు. బహుశా ప్రతి మనిషికీ భగవంతుడు సమానంగా పంచి ఇచ్చిన వరం అదొక్కటేనేమో!'

కంపార్టుమెంటులో అంతా కబుర్లు ఆపి భోజనాలకు పూనుకున్నారు. కామేశం తిరుపతిలో స్టేషన్ బయట కొనుక్కున్న బన్నును సంచిలోంచి తీసుకుని తిని మంచినీళ్లు త్రాగాడు.

కడుపులు నిండగానే ఇక చేయవలసిందేమీ లేదన్నట్టు పడకలకు వుపక్రమించారంతా. కామేశం కూడా

చెప్పుల జతను బెర్త్‌క్రిందకు త్రోసి, హ్యాండ్‌బ్యాగ్‌తో అప్పరు బెర్త్ ఎక్కేసాడు.

★★★

కంపార్టుమెంటులో గందరగోళానికి మెలకువ వచ్చేసింది కామేశానికి. కళ్లు తెరిచి చూస్తే అప్పటికే తెల్లవారిపోయింది. కాఫీ, చాయ్ వాలాల అరుపులు ప్రయాణీకులకు సుప్రభాతం పలుకుతున్నాయి. బెర్త్‌మీంచి క్రిందకు దిగాడతను.

కంపార్ట్‌మెంటులో చెప్పులు పోయాయట!..అదీ ఆ గందరగోళానికి కారణం.

కంగారుగా బెర్త్‌క్రింద చూసుకున్నాడు కామేశం. గుండె గుభేల్‌మంది. తన చెప్పులు కనిపించలేదు.

అతని వాలకం గమనించి, "మీ చెప్పులు కూడా పోయాయా మాస్టారూ?" అనడిగాడు గుండాయన.

నీరసంగా తలవూపాడు కామేశం.

"ఆ దొంగరాస్కెల్ ఎవరి చెప్పులూ మిగల్చలేదన్నమాట!" అన్నాడు గుండాయన మళ్లీ.

"అంటే?"

"మనందరి చెప్పులూ పోయాయి. కాకపోతే ఆడవాళ్లకు కన్సెషనిచ్చాడు. వాళ్లవి ఒక్కో చెప్పే తీసుకెళ్లాడు" చెప్పాడతను.

"చీకట్లో ఆ చెప్పులు రెండూ కనిపించుండవు. పాపం, ఆ అబ్బాయివి కొత్త షూస్ అట. ఈయన చెప్పులు కూడా ఈమధ్యనే కొన్నాడట బోలెడు డబ్బులు పోసి" అంటూ వివరించాడు బట్టతలాయన.



ఆడవాళ్లిద్దరివీ ఎడమకాలి చెప్పులు మాత్రమే మిగిలున్నాయి. పాతజోళ్లతో సయితం అందరివీ మాయమయ్యాయి.

ఆశ చావక బెర్త్‌క్రింద కలయజూసాడు కామేశం. చెప్పులకోసం. ఎందుకంటే వాటిని వూరికే ఇచ్చినా ఎవరూ తీసుకోరన్న ధీమా అతనిది.

"మీది కూడా కొత్త జతేనా ఏమిటి కొంపదీసి?" అనడిగాడు గుండాయన, అది చూసి.

"ఔనండీ" అనేసాడు కామేశం అప్రయత్నంగా.

"ఎన్నాళ్లవుతుందేమిటి కొని?" బట్టతలాయన ప్రశ్న.

"పోయినవారమే కొన్నాను"-మరో అబద్ధం!

"బాటావేనా?" గుండాయన ఆరా. అతనివి బాటా చెప్పులు మరి.

"ఓను" మళ్లీ అబద్ధం!

"అయితే మూడునాలుగు వందలు సునాయా[సంగా] వుంటాయి" అన్నాడు బట్టతలాయన. "నావి, ఆ పెద్దాయనవి మాత్రం పాత చెప్పులేలే" అంటూ నవ్వేసాడు.

సైడుబెర్తు ముసలాయన అతనితో శ్రుతి కలి[పాడు].

"దరిద్రం తీరిపోయింది!" అంటూ.

అందరూ తమ చెప్పులు కొత్తవని చెప్పాక[తన]వి మాత్రం పరమ పాతవని చెప్పుకోవడానికి అహం కాదుగాని, అభిమానం అడ్డువచ్చింది కామేశానికి...వాటిని కొని ఎన్నేళ్లయిందో గుర్తులేదు. అసలు వాటినింకా చెప్పులనాలో లేదో కూడా తెలీదు. అప్పటికే వాటికి చాలా బైపాస్ సర్జరీలు జరిగాయి. అడపాదడపా చేసే చిన్నా చితకా ఆపరేషన్ల సంగతి సరేసరి. వాటితో ఎలాగో మ్యానేజ్ చేసుకుంటూ వస్తున్నాడు తాను. ఇప్పుడు అవీ పోయాయి. ఉసూరుమనిపించింది.

తిరుమలశ్రీ

అబద్ధం చెప్పినందుకు ముందు కాస్త ఎలాగో అనిపించినా మనసుకు సర్దిచెప్పుకున్నాడు కామేశం. పోయిన చెప్పులు ఎలాగూ పోయాయి. నిజం చెప్పి నలుగురిలో చులకనయ్యేకంటే అబద్ధం చెప్పి పరువు కాపాడుకోవడంలో తప్పులేదనిపించింది. ఆవిధంగా కనీసం వూహల్లో, వూసులలోనయినా తనకు కొత్తచెప్పులు-అందులోనూ బాటావి-వున్నాయన్న క్షణికా

నందాన్ని పొందగలిగాననుకున్నాడు.

అంతా తలోరకంగానూ మాట్లాడుకుంటున్నారు.

''ఇంకా నయం. సామానేమీ పోలేదు'' అంది బట్టతలాయన భార్య.

''చెప్పుల దొంగకు సామాను దొంగిలించే ధైర్యం వుండదు'' అన్నాడు గుండాయన, అదేదో రూల్ అయినట్టు.

అందరూ తలోరకంగానూ వ్యాఖ్యానిస్తున్నారు. అవన్నీ చెవుల్లో పడుతూవున్నా బుర్రలోకి మాత్రం ఎక్కడంలేదు కామేశానికి. కొత్తచెప్పులే కొనాలంటే అధమ పక్షం ఓ వంద రూపాయలైనా వుండాలి-అవీ కంపెనీ చెప్పులు కాకపోతే. ఇప్పుడంత డబ్బు ఎక్కణ్ణుంచి తేవాలన్నదే అతని సమస్య. చెప్పుల్లేకుండా స్కూల్‌కి వెళ్లలేడు. స్కూల్‌కి వెళ్లాలంటే చెప్పులు కావాలి. చెప్పులు కొనాలంటే డబ్బులు కావాలి. ఎలా?

''ఆ దొంగ వెధవ ఎవడో చీకట్లో చేతికందిన చెప్పుల్ని సంచిలో వేసుకుపోయుంటాడు. చూసుకునుంటే తన చెప్పులకు కాళ్లొచ్చేవి కావు'' అనుకున్నాడు.

ఏడుకొండలూ ఎక్కి ఏడుకొండలవాణ్ణి దర్శించుకుని వస్తే ఆ సంతోషం దక్కకుండా..ఏమిటీ ఈ నష్టమూ, కష్టమూను?... అనిపించింది.

గుండాయనకింకా ప్రాణం కొట్టుకుంటూనే వుంది. కొత్తచెప్పులు పోయాయని, ఓ పక్కన చెప్పుల దొంగను తిడుతూనే, ఆశ చావక బెర్త్‌క్రింద దూరి వెదకసాగాడు. అలా వెదుకుతుంటే లోపల-ఇటువైపు భాగానికీ, అటువైపు భాగానికీ మధ్యనున్న బెర్త్‌ల క్రింద-ఏదో చెప్పుల జత చేతికి తగిలింది. కష్టపడి దానిని బయటకు లాగాడు, ''ఇక్కడేవో చెప్పులున్నట్టున్నాయి'' అంటూ.

చెప్పులు పోగొట్టుకున్నవారంతా ఆత్రుతగా అటు వైపు చూసారు.

శిథిలావస్థలో వున్న చెప్పుల జత అది.

అందరి వదనాలలోనూ నిరాశ కనిపిస్తే-

కామేశం ముఖం ఓ క్షణం వెలిగిపోయింది దాన్ని చూడగానే. అది-తనదే మరి!

అయితే, ఆ వెలుగు క్షణికమే.

తనవి కొత్తచెప్పులని గొప్పలు చెప్పుకున్నాడు తాను. ఇప్పుడు ఆ పాత చెప్పులు తనవేనని ఒప్పుకోగలడా?

అందరూ ఆ చెప్పులు తమవి కావంటూంటే తాను మౌనంగా వుండిపోయాడు.

చాలా ఆత్రుతగా వుందతనికి. ఆనందంగానూ వుంది. ఎందుకంటే-ఆ చెప్పుల్ని ఎవరూ ముట్టుకోరు. హైదరాబాద్ చేరుకున్నాక అందరూ దిగిపోగానే క్వయిట్‌గా వాటిని తొడుక్కుని వెళ్లిపోవచ్చును తాను.

అయితే- ఆ ఆశా క్షణికమే అయిపోయింది.

కారణం- ''మంచి చెప్పులు తొడుక్కుని వాడి డొక్కు చెప్పులు విడిచేసుంటాడు ఆ దొంగ రాస్కెల్!'' అంటూ కోపంతో, కసితో బూతులు తిట్టుకుంటూ వాటిని చటుక్కున కిటికీలోంచి బయటకు విసిరేసాడు గుండాయన.

మెరుపులా జరిగిపోయిన ఆ సంఘటనకు కొయ్యబారిపోయాడు కామేశం. తన ప్రాణాలనే మెలిపెట్టి రైల్లోంచి విసిరేసినట్టుగా విలవిలలాడిపోయాడు, తన చెప్పుల జతను తన కళ్లముందే బయటకు విసిరేస్తూంటేను.


గొప్పలకు పోయి అబద్ధం చెప్పిన నేరానికి అది తనకు తానుగా విధించుకున్న శిక్షగా ఎంచి రెక్కలుతెగిన పక్షిలా గిలగిల కొట్టుకుంది అతని మనసు.

★

# చండీగర్‌లో కాక్టస గార్డెన్

అదొక బ్రహ్మజెముడు ఉద్యానవనం. బ్రహ్మజెముడు ఉద్యానవనమేంటి, ముళ్లపొదలు ఉద్యానవనమెలా అవుతుంది అని ఆశ్చర్యపోతున్నారా? కాని ఇది ముమ్మాటికీ నిజం. ఈ వనం సాక్షాత్తూ వుంది. ఈ ఉద్యానవనం పంజాబ్, హర్యానాల ఉమ్మడి రాజధాని చండీగర్‌లోని





పంచకుల ప్రాంతంలో అయిదో సెక్టార్‌లో ఉంది.

ఈ కాక్టస్ గార్డెన్ 1987లో స్థాపించారు. ఏడు ఎకరాల మేర ప్రాంతంలో విస్తరించి ఉంది. ఆసియా ఖండంలోనే మొట్టమొదటిదైన ఈ కాక్టస్ గార్డెన్‌లో 2,500 రకాల చెట్లు ఉన్నాయి. ఊరి బయట రాళ్లు, రప్పల్లో పిచ్చిగా పెరిగే ఈ చెట్లను ఇప్పటికీ ఇంటి ఆవరణలో పెంచుకోవడానికి చాలామంది ఇష్టపడరు.

ఇటీవలే నగరాలలో నివసించే కొందరు మాత్రం ఈ బ్రహ్మజెముడు చెట్లను పెంచుకోవడం పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. బ్రహ్మజెముడు మొక్కల్లో కొన్ని బంతుల్లా వుంటే మరి కొన్ని వెదురుగెడల్లా ఉంటాయి. బ్రహ్మజెముడు చెట్లకు ముళ్లుంటాయి. కాని ముళ్లు లేని మృదువైన చెట్లు కూడా వుంటాయి. వాటిలో కొన్నిటికి పూలు కూడా పూస్తాయి. వేలాది రకాల బ్రహ్మ జెముడు చెట్లను కాక్టస్ గార్డెన్‌లో ఒకే చోట చూడటం అంటే నిజంగా ఒక అద్భుత అనుభూతి!

తూర్పు ఆఫ్రికాకు చెందిన ఒక జాతి బ్రహ్మజెముడు చెట్లు లేళ్లకు ఆహారంగా ఉపయోగపడతాయి! మరికొన్ని జాతుల మొక్కలు ఆయుర్వేద, యునాని ఔషధాల తయారీలో వాడతారు. బ్లడ్‌ప్రెషర్, కీళ్లనొప్పులు, క్యాన్సర్ తదితర వ్యాధుల చికిత్సలో సైతం ఇవి ఉపయోగపడుతున్నాయి. అంతేకాదు, స్వీట్లు తయారుచేయడంలో కూడా వీటిని కొందరు శుద్ధిచేసి వాడుతున్నారు. పశ్చిమ దేశాలలో సౌందర్య సాధనాల తయారీలో ఈ మొక్కలు దోహదపడుతున్నాయి.

ప్రజలలో బ్రహ్మజెముడు పట్ల గల మూఢవిశ్వాసాలను, అపోహలను తొలగించి ప్రతివారు వీటిని పెంచేవిధంగా కృషి చేయాలి. పర్యావరణ పరిరక్షణలో బ్రహ్మజెముడు చెట్ల పాత్ర కూడా ఎంతో ఉందని శాస్త్రజ్ఞుల కథనం.

చండీగర్ నగరం ఫ్రెంచి నగర నిర్మాణ దక్షుడైన లికార్బుయిజల్ పర్యవేక్షణలో ప్లాన్ ప్రకారం శివాలిక్ కొండలశ్రేణి అంచున 1950 ప్రాంతంలో నిర్మించారు. ఇంకా ఇక్కడ రాక్‌గార్డెన్, పింజోరిగార్డెన్, రోజ్‌గార్డెన్, చండీ మందిరం లాంటి దర్శనీయ ప్రదేశాలున్నాయి. భారతదేశంలోనే ఇదొక విలక్షమైన నగరంగా ప్రఖ్యాతిగాంచింది. నగరమంతా 47 సెక్టార్లలో విభజింపబడి వుండటం ఓ విశేషం.

-నల్లబెల్లి శ్రీమన్నారాయణ